క్లుప్తంగా

ఘనంగా కోటమైసమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకున్న నరేందర్‌రెడ్డి

దౌల్తాబాద్: మండలంలోని అంతారం గ్రామంలో వెలసిన కోటమైసమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు, బోనాల నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఉత్సవాలకు హాజరైన నరేందర్‌రెడ్డిని ఆలయ కమిటీ నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మహిపాల్, సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

సాయన్న విగ్రహావిష్కరణకు రండి

ముదిరాజ్ యువత తాలుకా అధ్యక్షుడు బాబు

పరిగి: ఈనెల 10న ఇప్పాయిపల్లిలో పండుగల సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముదిరాజ్ బంధువులు భారీగా తరలిరావాలని ముదిరాజ్ యువత తాలుకా అధ్యక్షుడు పర్షమోని బాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో విగ్రహావిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముదిరాజ్ మహాసభ యువత జాతీయ అధ్యక్షుడు కాసాని వీరేశ్ హాజరుతున్నట్లు తెలిపారు.

తాండూరులో 73,918 దరఖాస్తులు

తాండూరు: ప్రజాపాలన కార్యక్రమానికి తాండూరు నియోజకవర్గ వ్యాప్తంగా 73,918 దరఖాస్తులు వచ్చాయి. నియోజకవర్గంలో మొత్తం 143 గ్రామ పంచాయతీలు, తాండూరు మున్సిపల్ పరిధిలోని 36 వార్డులలో ప్రజల నుంచి గ్యారంటీ స్కీంల కోసం అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ప్రజల వద్దకే అధికార యంత్రాంగం వచ్చి గ్రామ, వార్డు సభలు నిర్వహించి నిరు పేద కుటుంబాల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. తాండూరు మున్సిపాలిటీలో 17,065 బషీరాబాద్ మండలంలో 14,150, పెద్దేముల్ మండలంలో 14,261, తాండూరు మండలంలో 15,283, యాలాల మండలంలో 13,159 చొప్పున దరఖాస్తులు అందాయని అధికారులు ధ్రువీకరించారు.

కొనసాగుతున్న దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ

అనంతగిరి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అభయహస్తం ఆరు గ్యారంటీ పథకాల దరఖాస్తుల స్వీకరణ ముగియడంతో ఆన్‌లైన్ ప్రక్రియను ప్రారంభించారు. వికారాబాద్ మండలంలో తీసుకున్న దరఖాస్తులను ప్రభుత్వం సూచించిన వెబ్‌సైట్‌లో పొందుపరిచేందుకు అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన ఆన్‌లైన్‌లో పొందుపరుస్తుంది. ఇందుకు సంబంధిత అధికారుల టీం దగ్గరుండి ఆన్‌లైన్ చేయిస్తున్నారు. ఈ విషయంలో మండల స్థాయి అధికారుల నుంచి ఉన్నతాధికారులు ఎప్పటికపుడు అప్‌డేట్ సేకరిస్తున్నారు. గడువులోగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసేలా చొరవ తీసుకుంటున్నారు. ఆదివారం వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయంలో అధికారులంతా దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియలోనే నిమగ్నమయ్యారు. జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుభాషిణి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ సత్తయ్య ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

జనవాడలో మహా పడిపూజ

శంకర్‌పల్లి: మండలంలోని జనవాడ గ్రామంలో అయ్యప్ప శరణు ఘోషలతో మార్మోగింది. ఆదివారం గ్రామ సర్పంచ్ లలితనర్సింహా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహాపడి పూజా కార్యక్రమం కేశవ గురుస్వామి నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాముల ఇరుముడి వైభవంగా జరిగింది. స్వాములు శబరిమల యాత్రకు బయలు దేరారు. భాస్కర్ చారి భజన మండలి పాడిన భక్తి పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి.

భక్తి మార్గంలో నడవాలి

చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



పూజలో పాల్గొన్న విశ్వేశ్వర్‌రెడ్డి

శంకర్‌పల్లి: ప్రతి ఒక్కరు భక్తి మార్గంలో నడవాలని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని ప్రొద్దటూరు గ్రామంలో నిర్వహించిన మల్లన్న కల్యాణ మహోత్సవంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పూర్వీకుల కాలం నుంచి వస్తున్న ఆచారాలను మరువకూడదన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఊరూరా ఊరేగింపు





కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు

- అయోధ్య రామయ్య అక్షింతలకు బ్రహ్మరథం
- భక్తిపారవశ్యంతో హారతులు పడుతున్న జనం
- గడపగడపకూ పంచేందుకు ఏర్పాట్లు

కొడంగల్ రూరల్ : అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న తరుణంలో శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో అయోధ్యలో పూజిత అక్షింతలను ఊరూరికి పంపిస్తున్నారు. పల్లెలు, పట్టణాల్లో రాములోరి పూజిత అక్షింతలను ప్రజలు ఎంతో భక్తి శ్రద్ధలతో హారతులు పట్టి శోభాయాత్రలు నిర్వహిస్తున్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం కోసం వందల ఏళ్లుగా ఎదురుచూస్తున్న భక్తుల కల నెరవేరుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రామయ్య పూజలు అందుకున్న అక్షింతలు తమ ఊరికి రావడంతో భక్తులు అయోధ్యకు వెళ్లివచ్చినంత ఆనందంగా భావిస్తూ వాటిని తలపై పెట్టుకొని గ్రామాలకు చేరుతున్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీఅభయాంజనేయస్వామివారి దేవాలయం నుంచి నిర్వహించిన శోభాయాత్రలో శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఊరేగింపు నిర్వహిస్తూ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల నాయకులు, ప్రజలు భక్తి భావం చాటుకున్నారు. పట్టణాలు, గ్రామాల్లో దారిపొడవునా ఊరేగింపులో భజనలు, శ్రీరామ జయరామ జయజయరామ అంటూ పాడుకుంటూ శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి చేరుకున్నారు.



దోమ : మోత్కూర్ హనుమాన్ దేవాలయంలో..

ఇంటింటికీ అక్షింతలు..

అయోధ్య రామయ్య ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా పూజిత అక్షింతలను గ్రామాలకు పంపిస్తూ శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్టు ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. అక్షింతలతోపాటు రాములవారి చిత్రపటాన్ని ప్రతి ఇంటికీ అందేలా చర్యలు తీసుకున్నట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. అయోధ్యలోని రామ మందిరం ప్రారంభమయ్యే సమయానికి ప్రతి ఇంట్లో పూజిత అక్షింతలు చేర్చేందుకు చర్యలు తీసుకున్నట్లు సభ్యులు తెలిపారు.



కొడంగల్ రూరల్: హస్నాబాద్‌లో..



కుల్కచర్ల: తిర్మలాపూర్ గ్రామంలో..



ధారూరులో.. హారతి ఇస్తున్న యువతి



అభయాంజనేయస్వామివారి దేవాలయంలో..



అనంతగిరి: చైర్‌పర్సన్ దంపతులకు అక్షింతలు ఇస్తున్న ప్రతినిధులు



పూడూరులో అక్షింతల కలశాన్ని ఊరేగిస్తున్న భక్తులు



దౌల్తాబాద్: అక్షింతలు పంపిణీ చేస్తున్న నాయకులు

పోరాట ఫలితం



550 ఏళ్ల పోరాట ఫలితమే శ్రీరామమందిర నిర్మాణం, ఈ తరం ప్రజలు చూడడం అదృష్టం. 22వ తేదీ ప్రతి ఒక్కరూ ఇంటి ముందు దీపాలు వెలిగిస్తూ పండగను జరుపుకోవాలి. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను గ్రామాలకు పంపించాం.

– సురారం రాకేష్, ట్రస్ట్ సభ్యులు

అదృష్టంగా భావిస్తున్నాం



రామజన్మభూమి నుంచి రాములోరి అక్షింతలు రావడం అదృష్టం. ఎన్న ఏళ్లుగా ఎదురుచూస్తున్న అయోధ్య రామమందిర నిర్మాణం మాకళ్ల ముందు పూర్తి కావడం ఆనందకరం. రామాలయ ట్రస్టు ద్వారా దేశంలోని ప్రతి ఇంటికీ రాముడి పాదాలను తాకిన అక్షింతలను పంపడం సంతోషకరం.

– డాక్టర్ రవీంద్రయాదవ్, కొడంగల్

దైవంతో సమానం



అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలు దైవంతో సమానం. రామ మందిర నిర్మాణం ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న క్రమంలో ప్రారంభోత్సవం జరగడం అదృష్టంగా భావిస్తున్నాం. వీటిని ప్రతి ఒక్కరూ స్వీకరించి తలపై చల్లుకోవాలి.

– లక్ష్మీనారాయణగుప్తా, ట్రస్ట్ సభ్యులు

ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించాలి



ప్రపంచవ్యాప్తంగా ఉన్నటువంటి హిందూవుల కల అయోధ్య రామమందిర నిర్మాణం. 22వ తేదీన నిర్వహించే ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ప్రతి ఇంట్లో కనీసం ఐదు దీపాలను వెలిగిస్తూ భక్తిపారవశ్యంతో భగవంతుడిని ఆరాధించాలి

– భానుప్రకాష్, ట్రస్ట్ సభ్యులు

కంపు.. కంపు

- పరిగి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పారిశుద్ధ్య లోపం
- పట్టించుకోని అధికారులు



బస్టాండ్ ఆవరణలో చెత్తాచెదారం

పరిగి: పరిగి బస్టాండ్ దుర్వాసనతో కంపుకొడుతోంది. ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు వచ్చిన ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండ్ అపరిశుభ్రం ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ వేసిన చెత్త అక్కడే ముురుగుతోంది. బస్టాండ్‌లో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తే కంపువాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. ఆర్టీసీ సిబ్బంది బస్టాండ్ ఆవరణను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచకపోవడంతో దుర్వాసన వస్తుందని ఆరోపిస్తున్నారు. నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు బస్టాండ్‌కు వచ్చి ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. వారికి సౌకర్యాలు కల్పించడంలో ఆర్టీసీ విఫలమవుతుందని విమర్శలు వస్తున్నాయి. బస్టాండ్ ఆవరణలోకి దుకాణదారులు చెత్త వేయడం, వేసిన చెత్తను నెల రోజులు అవుతున్నా ఎత్తకపోవడం అది కాస్త కంపు కొట్టి దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. పది నిమిషాలు బస్టాండ్‌లో ఉండాలంటే ప్రయాణికులు నానా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నిత్యం బస్టాండ్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు.



బస్టాండ్ ఆవరణలో మురుగు

అ'పూర్వ' సమ్మేళనం

కొడంగల్ రూరల్ : పట్టణంలోని ప్రాచ్య భాషా కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పట్టణంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో అప్పటి గురువులు శ్రీమాన్ శ్రీనివాసాచార్యుల దంపతులను ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా విద్యా ర్థులు ఉన్నత స్థాయికి చేరేలా తోడ్పాటునందించిన గురువులకు సన్మానం చేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ప్రాచ్య భాషా కళాశాలలో పూర్వ విద్యార్థులు ఎందరో ఉన్నత స్థానాలకు చేరుకొని రిటైర్ అయ్యారని, గతంలోమాజీ ఎమ్మెల్యేలు గురునాథ్ రెడ్డి, వెంకటయ్యల ఆధ్వర్యంలో కళాశాల కొనసాగేలా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు.

ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలి ..

2006–07వ విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని పలు కళాశాలలను ప్రభుత్వం ఎత్తేయడంతో అప్పటి నుంచి ఇక్కడి ప్రాంత విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు విశ్రాంత జీహెచ్‌ఎంలు పేర్కొన్నారు.కార్యక్రమంలో విశ్రాంత జీహెచ్‌ఎం శీలాదేవి, విశ్రాంత ప్రిన్సిపాల్ భీమయ్య, అంగడిరాయిచూర్ హెచ్‌ఎం వెంకటప్ప, అధ్యాపకులు అక్కి శ్రీనివాసమూర్తి, పండరీ, ఉపాధ్యాయులు రత్నకళ, కరుణాకర్, టైలర్ రమేష్ పాల్గొన్నారు.



కొడంగల్ రూరల్ : శ్రీనివాసాచార్యులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

సరస్వతి శిశు మందిర్‌లో..

తాండూరు రూరల్: ప్రతి ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయి. తాండూరు పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో 2000–2001 పదో తరగతి బ్యాచ్‌కు సంబంధించిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 23 ఏళ్ల తర్వాత కలుసుకున్న వీరు ఆనందంగా గడిపారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను శాలువ, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమం

చేవెళ్ల: మండలంలోని తంగడపల్లి గ్రామంలో పురాతన దశావతార సహిత శ్రీలక్ష్మీ అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సుదర్శన హోమం నిర్వహించారు. వేద పండితులు, ఆలయ పూజారుల ఆధ్వర్యంలో చేసిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, మండల నాయకులు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అయ్యవారి వెంకటాచార్యులు మాట్లాడుతూ.. విద్యార్థులకు మంచి జ్ఞానం వస్తుందని ఏకాగ్రతను పెంచుతుందన్నారు. పూజలను శేషాద్రి, వేణు, ఫణీంద్రలు చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల సర్పంచ్ శైలజ, కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు సమత నాయకులు చంద్రశేఖర్, రాములు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభం

కొత్తూరు: మండల పరిధిలోని గూడూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆదివారం స్థానిక సర్పంచ్ సత్తయ్య ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనారోగ్యాలకు గురైతే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చికిత్స చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, సురేష్, సుధాకర్‌రెడ్డి, రవి, అశోక్, పద్మరావు, లింగం గౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత

షాబాద్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన స్నేహితుడు పిట్టల రమేశ్ కుటుంబానికి అండగా ఉంటామని పదో తరగతి మిత్రులు పేర్కొన్నారు. ఆదివారం షాబాద్ మండల కేంద్రంలోని చెందిన రమేశ్ ఫిట్స్‌తో మృతి చెందాడు. అతని భార్య మంజులకు ఆదివారం రూ.43,500 నగదును అందజేశారు. గత డిసెంబర్ 25న అతడికి ఫిట్స్ రావడంతో కాలువలో పడి మరణించాడు. దీంతో అతడి పదో తరగతి బ్యాచ్ మిత్రులు కుంటుబాన్ని ఆదుకునేందుకు శ్రీకారం చుట్టారు. అందరూ కలిసి నగదును పోగు చేసి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పదో తరగతి మిత్రులు ఇమ్రాన్, రాజేష్, క్రిష్ణగౌడ్, రామకృష్ణ, శ్రీనివాస్, శ్రీను ఉన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: రెడ్డి యువత అన్ని రంగాల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని రెడ్డి భవనంలో రెడ్డి యువజన సేవా సమితి ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో రెడ్డి యువత రాణించాలన్నారు. ప్రతి యువకుడు లక్ష్యాన్ని ఎంచుకొని నిరంతరం సాధన చేయాలన్నారు. కృషి, పట్టుదల ఉంటే అసాధ్యం కానిది ఏదీ లేదన్నారు. రెడ్డి బంధువులందరూ సంఘటితంగా అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో పాలమూరు ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ నరేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, అరుంధతి, దామోదర్‌రెడ్డి, శ్రీలత, అంకిత, కల్పన తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట



ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని ఎస్‌బీపల్లిలో ఆదివారం సర్పంచ్ అంబటి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో హెచ్‌ఎండీఏ, 15వ ఆర్థికసంఘం నిధులతో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం, పాఠశాల భవనాలను ఎమెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి పను లు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయలేదన్నారు. దీంతో సర్పంచులు అనేక ఇబ్బందులు పడి సొంత ఖర్చులతో తమకు తోచిన విధంగా అభివృద్ధి చేశారన్నారు. గత ప్రభుత్వంలో పంచాయతీలను అభివృద్ధి బాటలో నడిపేందుకు కృషి చేసిన సర్పంచులకు సరైన గుర్తింపు, ప్రో త్సాహం లేవన్నారు. ఎలాంటి ఆదాయం, వనరులు లేని గ్రామాల సర్పంచులు అప్పులు చేసి మరీ సిబ్బందికి వేతనాలు ఇచ్చిన పరిస్థితి ఉండేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి పరిస్థితులను అధిగమించి ప్రతి పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రణాళిక బద్ధంగా నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ మధుసూదన్ రెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీడీఓ శరత్‌చంద్రబాబు, పార్టీ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, నాయకులు వజ్రలింగం, వెంకటయ్య, బాల్‌రాజు, దేవేందర్, దయానంద్‌గుప్తా, రాందాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు చేరువయ్యేలా కృషి

- చేవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి పామెన భీంభరత్
- మొయినాబాద్‌లో క్రైస్తవులకు కానుకల పంపిణీ

మొయినాబాద్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని ఆ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పద్మావతి గార్డెన్‌లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్రైస్తవులకు క్రిస్మస్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్రిస్మస్‌కు ముందే గిఫ్టులు ఇవ్వాలనుకున్నామని.. అనివార్య కారణాల వల్ల ఆలస్యమైందన్నారు. ప్రభుత్వం అందించే ఆరు గ్యారంటీ పథకాలు ప్రతి గ్రామంలో అర్హులందరికీ అందేలా చూస్తామన్నారు. పార్టీ కార్యకర్తలు సైతం ప్రభుత్వ పథకాలను ప్రజలకందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, అధికార ప్రతినిధి గౌరి సతీశ్, మండల పార్టీ అధ్యక్షుడు మాణయ్య, పీఏసీఎస్ చైర్మన్ చందారెడ్డి, ఎంపీటీసీ రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మల్లేష్ యాదవ్, వీరభద్రస్వామి, సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, వాసుదేవ్, మాజీ ఎంపీటీసీ యాదయ్య, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు రాజు, జైపాల్‌రెడ్డి, రాములు, ఆంజనేయులుగౌడ్, నిరంజన్‌గౌడ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శేరిగూడలో ఎల్లమ్మ బోనాలు

శంకర్‌పల్లి: మన సంస్కృతి సాంప్రదాయాలను మరవ కూడదని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి భీంభరత్ అన్నారు. ఆదివారం మండలంలోని శేరిగూడ గ్రామంలో నిర్వహించిన శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాల మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన్ని గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీక బోనాల జాతర అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, తిరుపతయ్య, మాణిక్యరెడ్డి, అనంత్‌రెడ్డి, శ్రీశైలం, రాంచందర్, కాశీనాథ్‌గౌడ్ పాల్గొన్నారు.



కానుకలు అందజేస్తున్న భీంభరత్ తదితరులు